క్లుప్తంగా

పెద్దదోర్నాల తహసీల్దార్‌గా అశోక్‌రెడ్డి


అశోక్‌రెడ్డి

పెద్దదోర్నాల: పెద్దదోర్నాల తహసీల్దార్‌గా చింతలపూడి అశోక్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ బాధ్యతలు నిర్వహించిన కిన్నెర శాంతి బదిలీపై కొత్తపట్నం తహసీల్దార్‌గా వెళ్లారు. రాచర్లలో విధులు నిర్వహిస్తున్న అశోక్‌రెడ్డి బదిలీపై దోర్నాల వచ్చారు. బాధ్యతలు చేపట్టిన అశోక్‌రెడ్డిని పలువురు నాయకులు, వీఆర్వోలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. భూవివాదాలు, రైతుల సమస్యలపై దృష్టి సారించనున్నట్లు తహసీల్దార్ అశోక్‌రెడ్డి తెలిపారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

కురిచేడు: అన్నదాత సుఖీభవ పథకంలో లబ్ధిపొందేందుకు రైతులు ఈకేవైసీ తప్పకుండా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి మధుబాబు సూచించారు. అర్హులైన రైతులందరూ తమ రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకులను కలిసి ఈకేవైసీ చేయించుకోవాలని చెప్పారు. ఈకేవైసీ చేయించుకోకుంటే అన్నదాత సుఖీభవ డబ్బులు పడవని తెలిపారు. రైతులు తమ ఆధార్ కార్డు, పొలం పాస్‌పుస్తకం తీసుకుని ఈకేవైసీ చేయించుకోవాలని ఆయన సూచించారు.

విద్యార్థినికి అభినందనలు


విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపాల్

దొనకొండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి 2024–25 విద్యా సంవత్సరంలో చదివిన షేక్ సఫియా ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైంది. కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకుంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె.దునుమణి సమక్షంలో కళాశాల సిబ్బంది బుధవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. విద్యార్థిని సఫియాకు బహుమతి అందించి అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి సఫియాను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగి సమాజానికి, తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తెచ్చి పెట్టాలని ఆకాంక్షించారు.

పెద్దదోర్నాలలో పర్యటించిన సబ్ కలెక్టర్

● ఆర్టీసీ బస్టాండ్‌తో పాటు పలు స్థలాల పరిశీలన


ఆర్టీసీ బస్టాండ్ స్థలాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

పెద్దదోర్నాల: మండల కేంద్రంలో పలు నిర్మాణాలకు సంబంధించిన స్థలాలను మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ పరిశీలించారు. బుధవారం ఆయన మండల కేంద్రానికి చేరుకుని తొలుత మండల కేంద్రంలోని ఆర్టీసీ స్థలాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం యడవల్లికి చేరుకుని సోలార్ పవర్ ప్లాంటేషన్‌కు అవసరమైన 9 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. అనంతరం డిగ్రీ కళాశాలకు సంబంధించి స్థానిక మార్కెట్ యార్డులో ప్రతిపాదనలో ఉన్న స్థలాన్ని ఆయన పరిశీలించి వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ అశోక్ రెడ్డి, సర్వేయర్ సురేష్ ఉన్నారు.

దుకాణంలో రూ.50 వేలు చోరీ

పెద్దారవీడు: మండలంలోని హనుమాన్ జంక్షన్ కుంటలో కిరాణా షాపులో బుధవారం మధ్యాహ్నం చోరీ జరిగింది. షాపు యజమాని జిల్లెల శివాంజనేయరెడ్డి చెప్పిన వివరాల ప్రకారం .. మధ్యాహ్నం భోజనం చేసేందుకు తండ్రి వెంకటరెడ్డిని షాపులో కుర్చోబెట్టి శివాంజనేయరెడ్డి ఇంటికి వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో ఒక వ్యక్తి సబ్బు కావాలని వచ్చి రూ.100 నోటు ఇచ్చాడు. ఆయన చిల్లర ఇస్తున్నాడు. ఈ లోపు మరో వ్యక్తి షాపులోకి వచ్చాడు. చిల్లర కోసం తల కిందకు పెట్టిన వెంకటరెడ్డిని ఒకరు గమనిస్తూ మరొకరు పక్కనే ఉన్న టేబుల్ సొరుగు తలుపు తీశాడు. రూ.500 కట్ట రూ.50 వేలు తీసుకుని గమనిస్తున్న వ్యక్తికి అందించారు. ఒకరి తర్వాత ఒకరు షాపు నుంచి బయటకు వెళ్లారు. భోజనం చేసిన అనంతరం కుమారుడు షాపులోకి వచ్చి కౌంటర్లో చూడగా రూ.50 వేలు మాత్రమే కనిపించాయి. డబ్బులు ఎలా పొయాయ్యాని అర్థం కాలేదు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్పందించిన ఎస్‌ఐ అనిల్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.


వై.పాలెం: జగనన్న పోరుబాటకు బయల్దేరిన రైతులతో ఎమ్మెల్యే తాటిపర్తి


పుల్లలచెరువు: పొదిలి వెళ్తున్న నాయకులు, కార్యకర్తలు


త్రిపురాంతకం: వైఎస్సార్ సీపీ నాయకులతో ఎమ్మెల్యే తాటిపర్తి

అన్ని దారులూ పొదిలి వైపే..

యర్రగొండపాలెం: జగనన్న పోరుబాటకు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున రైతులు పొదిలి కదిలి వెళ్లారు. పొగాకు రైతుకు గిట్టుబాటు ధర కల్పించేందుకు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన రైతన్నకు అండగా పొదిలిలో బుధవారం జరిగిన జగనన్న పోరుబాట కార్యక్రమానికి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రైతులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. నల్లమల అటవీ ప్రాంతంలో నివశించే గిరిజనులు వేకువ జామున 4 గంటలకే తాము స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకున్న వాహనాల్లో బయల్దేరి పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసుకుంటూ పొదిలికి వెళ్లారు. దేవరాజుగట్టుకు చేరుకున్న నియోజకవర్గంలోని జగనన్న సైన్యం ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ జెండాలను పట్టుకొని ప్రతి గ్రామం నుంచి వేల సంఖ్యలో కదం తొక్కిన సైన్యం కూటమి నాయకుల గుండెల్లో దడ పుట్టించింది. జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ అధికారంలో లేకున్నా ఆయన ప్రజల గుండెల్లో గూడు కట్టుకొని ఉండటంతో క్రమశిక్షణ గల సైన్యం వలే రైతులు, అభిమానులు కదలి వెళ్లడాన్ని అధికార కూటమి నాయకులకు మింగుడు పడలేదు. సైన్యం కదం తొక్కడాన్ని, జగనన్న పొదిలికి చేరుకుని రైతుల పక్షాన నిలిచిన తీరును ప్రజలు వీక్షించకుండా ఉండేందుకు సాక్షి చానల్‌తో పాటు మరికొన్ని చానళ్ల ప్రసారాన్ని నిలిపి వేశారు. యర్రగొండపాలెం నుంచి బయల్దేరిన నాయకులలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, మండల అధ్యక్షుడు ఏకుల ముసలారెడ్డి, జిల్లా కార్యదర్శులు కె.ఓబులరెడ్డి, సింగా ప్రసాద్, ఆదిత్య విద్యా సంస్థల అధినేత సూరె రమేష్, వివిధ విభాగాల నాయకులు ఎం.బాలగురవయ్య, పబ్బిశెట్టి శ్రీనివాస్, సయ్యద్ జబీవుల్లా, కందూరి కాశీనాథ్, ఆర్.అరుణాబాయి, దోగిపర్తి సంతోష్‌కుమార్, రాములు నాయక్, వై.వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.


పెద్దదోర్నాల నుంచి భారీగా తరలి వెళ్తున్న నాయకులు


దొనకొండ నుంచి బయల్దేరిన మహిళలు

మహిళలు సైతం జగనన్న పోరుబాటకు..

దొనకొండ: మండలంలోని 18 పంచాయతీల నుంచి మహిళలు సైతం జగనన్న పోరుబాటకు బుధవారం పొదిలి బయల్దేరి వెళ్లారు. పార్టీ మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో 135 వాహనాల్లో సుమారు 3500 మంది పొదిలికి బయల్దేరి వెళ్లారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి ఒక్కరికి మౌలిక వసతులు కల్పించారు. పోరుబాటకు బయల్దేరిన వారిలో జిల్లా యూత్ విభాగం అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గుంటు జాకోబు, జిల్లా యాక్టివిటీ సెక్రటరీ బత్తుల వెంకట సుబ్బయ్య యాదవ్, నియోజకవర్గ బూత్ కన్వీనర్ కాలూరి రమణయ్య, బీఎస్ రాజు, నూనె వెంకటరెడ్డి, భీమిని వెంకటేశ్వర్లు, వజ్రగిరి సోలోమన్ రాణి, సైరాబాను, రహంతుల్లా, షేక్ రసూల్, నూనె రవికుమార్, దగ్గుల వెంకటేశ్వరరెడ్డి, డి.చెంచిరెడ్డి, ఎగ్గోని కృష్ణారెడ్డి, పెసల శ్రీకాంత్‌రెడ్డి, కొత్తం వెంకటరెడ్డి, దూదేకుల ఇస్మాయిల్, ముజాయిద్, గొంగటి పోలిరెడ్డి, పాతకోట కోటిరెడ్డి, వల్లపునేని వీరాచారి, పత్తికొండ వెంకట సుబ్బయ్య, వెన్నపూస చెంచిరెడ్డి, గోనె జాకోబు, కొండయ్య, ఇండ్ల శ్రీనివాసరావు, పులిమి శివయాదవ్, కె.ప్రసాద్, యద్దనపూడి జాన్ ప్రకాష్, ఐలూరి శ్రీనివాసరెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, ముడమంచు వెంకటేశ్వర్లు, బెజవాడ ఇర్మియా, కిరణ్‌ప్రసాద్, యామన బాలిరెడ్డి, బాపనపల్లి శ్రీను, కన్నెధార వెంకట సుబ్బయ్య, విప్పర్ల చెన్నయ్య, కసిబిసి నాగరాజు, రామగిరి హుస్సేన్, తాల్లూరి నగేష్, వడ్లమూడి బుజ్జి, వడ్లమూడి ఏడుకొండలు, పొన్నెబోయిన మూర్తయ్య, దోలా చంద్ర, మంగయ్య, రామిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

■ తాళ్లూరు: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదిలి పర్యటనకు మండలం నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పొదిలి వెళ్లిన వారిలో మండల పార్టీ అధ్యక్షుడు తూము వెంకట సుబ్బారెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శిలు పోశం మధుసూదన్ రెడ్డి, ఐవీ సుబ్బారెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘ ఉపాధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి, పార్టీ ఉపాధ్యక్షులు పులి ప్రసాద్‌రెడ్డి, ఆలోకం హరిబాబు, సర్పంచ్‌లు కోట శివలక్ష్మి రామిరెడ్డి, మందా శ్యాంసన్, షేక్ వలి, చిమట సుబ్బారావు, మంచాల వెంకటేశ్వర్ రెడ్డి, ముచ్చుమారి కోటేశ్వరమ్మ బ్రహ్మారెడ్డి, ఎంపీటీసీ కోటేష్, యామర్తి ప్రభుదాస్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దేవదానం, గంగమ్మ తల్లి దేవస్థానం మాజీ చైర్మన్ కె. శ్రీనివాసరావు, ప్రచార విభాగం అధ్యక్షుడు యత్తపు మధుసూదన్ రెడ్డి, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు జక్కుల రామకృష్ణ, మాజీ జెడ్పీటీసీ లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కొర్రపాటి విష్ణు, అడ్వొకేట్లు గోపు శ్రీనివాస్, నాగమల్లేశ్వర్‌రెడ్డి, జిల్లా మైనారిటీ మాజీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ లతీఫ్ ఉన్నారు.

■ త్రిపురాంతకం: పొదిలిలో బుధవారం జరిగిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యక్రమానికి ఎంపీపీ ఆళ్ల సుబ్బమ్మ ఆంజనేయరెడ్డి, వైస్ ఎంపీపీ పి.కృష్ణ, మండల పార్టీ కన్వీనర్ ఎస్.పోలిరెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు రంగబాబు, మహిళా అధ్యక్షురాలు సరళ, ఎంపీటీసీ ఎస్.సుబ్బారావు, మాజీ సర్పంచులు గాలెయ్య, గురవయ్య, యూత్ నాయకులు కృష్ణారెడ్డి, కార్యకర్తలు తరలి వెళ్లారు.

■ పుల్లలచెరువు: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం పొగాకు రైతుల కోసం ఏర్పాటు చేసిన పోరుబాట కార్యక్రమంలో స్థానిక ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. యర్రగొండపాలెం శాసనసభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున పొదిలి తరలి వెళ్లారు. సర్పంచ్‌లు సత్యనారాయణరెడ్డి, కోటిరెడ్డి, రమణారెడ్డి, ఉపాధ్యక్షుడు రాములు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జానకిరఘు, జిల్లా సెక్రటరీ వెంకటేశ్వర్లు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గాలిరెడ్డి, రోశిరెడ్డి, శివారెడ్డి, వెంకటేశ్వర్లు, చెంచురెడ్డి, పుల్లారెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఆనందరావు, కోటిరెడ్డి, మహిళా నాయకులు ఉడుముల అరుణమ్మ, బీసీ మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, పాల్గొన్నారు.

■ పెద్దదోర్నాల: రైతన్నకు తోడుగా పోరుబాటలో పాల్గొనేందుకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహనరెడ్డి పొదిలికి వస్తున్న నేపథ్యంలో కార్యక్రమంలో పాల్గొనేందుకు మండలం నుంచి భారీగా కార్యకర్తలు పొదిలి తరలి వెళ్లారు. మండల పార్టీ కన్వీనర్ గంటా రమణారెడ్డి ఆధ్వర్యంలో మండల నాయకులు లాలూనాయక్, దర్శనం నాగయ్య, దూదేకుల కాశింపీరా, అల్లు రాంభూపాల్‌రెడ్డి, గుంటూరు గాలిరెడ్డి, బాలరాజు, మాండ్ల వెంకటేశ్వర్లు, చిట్యాల యోగిరెడ్డి, కర్రా మల్లారెడ్డి, యోసోబు, గొలమారు రాజశేఖర్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు.


వై.పాలెం: పోరుబాట ర్యాలీలో మహిళలతో ఎమ్మెల్యే తాటిపర్తి


తాళ్లూరు: పొదిలి తరలి వెళ్తున్న నాయకులు, కార్యకర్తలు

ఖరీఫ్‌కు రైతులు సన్నద్ధం కావాలి


ఖరీఫ్ సాగు గురించి వివరిస్తున్న శాస్త్రవేత్తలు

కురిచేడు: ఖరీఫ్ పంటల సాగుకు రైతులు సన్నద్ధమయ్యే విధానాన్ని కృషి విజ్ఞాన కేంద్రం నోడల్ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వరరెడ్డి సూచించారు. మండలంలోని కల్లూరు, పడమర కాశీపురం గ్రామాల్లో బుధవారం ఆయన వ్యవసాయాధికారులతో కలిసి వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ప్రీ ఖరీఫ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ కోళ్ల పరిశోధన సంస్థ హైదరాబాద్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్‌లో రైతులు శాస్త్రవేత్తల సలహాలతో సాగు చేసుకోవాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల అభ్యున్నతికి చేయూతగా అందించే వివిధ రకాల పథకాల గురించి తెలిపారు. భూసార పరీక్షలను ఖరీఫ్ సాగుకు ముందే చేయించుకొని ఖరీఫ్ సాగుకు సన్నద్ధం కావాలని డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి సూచించారు. రైతులు ముందుగా పొలాలను లో దుక్కులు దున్నుకోవాలని చెప్పారు. తద్వార భూమి నుంచి ఆశించే వేరుకుళ్లు తెగుళ్ల నుంచి పంటలు రక్షించుకోవచ్చని, అంతేకాకుండా కలుపును కూడా సమర్థంగా అరికట్టవచ్చున్నారు. పత్తిలో వచ్చే ఎండుతెగులు, మిరపలో వచ్చే వేరు పురుగు, కందిలో వచ్చే కాయ ఈగ, మారుక మచ్చల పురుగు నివారణకు సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు వివరించారు. ఈ–పంట నమోదు చేసుకుంటే రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందించే వివిధ పథకాల వివరాలు వ్యవసాయాధికారి మధుబాబు వివరించారు. ఖాళీగా ఉన్న భూముల్లో ఫారెస్ట్ జాతి, లేదా ఉద్యానవనశాఖకు చెందిన పంటలను సాగు చేస్తే భూ తాపాన్ని తగ్గించి వర్షాలు సకాలంలో కురిసేందుకు దోహదపడవచ్చని చెప్పారు. భూమిలో సేంద్రియ కర్బనం పెరిగేందుకు ఆస్కారం ఉంటుందని తెలిపారు. రైతులకు 50 శాతం సబ్సిడీలో పచ్చరొట్టి ఎరువులకు సంబంధించిన విత్తనాలు అందజేస్తున్నట్లు వివరించారు. యాజమాన్య పద్ధతులు ఎలా చేపట్టాలో ఉద్యానవన శాఖ విస్తరణాధికారి బి.ధనలక్ష్మి తెలిపారు. ఏయే పంటలకు రాయితీ వస్తుందో ఆమె వివరించారు. ఆత్మ వ్యవసాయాధికారి, గ్రామ సర్పంచ్‌లు, వివిధ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రుణాల రికవరీపై సమీక్ష

తాళ్లూరు: ముడలంలోని స్థానిక వెలుగు కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య సమావేశం బుధవారం ఎంఎంఎస్ అధ్యక్షురాలు సుజాత అధ్యక్షతన నిర్వహించారు. స్త్రీనిధి రుణాలకు రూ.29 లక్షల వరకు బకాయిలు ఉండటంతో అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామైఖ్య సంఘ బాధ్యులు స్పందించి రుణాల వసూళ్లపై శ్రద్ధ చూపాలని స్త్రీనిధి జోనల్ డీజీఎం ఉమామహేశ్వరావు, ఏజీఎం ఉదయ్‌కుమార్, ఏసీ పవన్‌కుమార్ సూచించారు. రుణాల వసూళ్లపై తగిన కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని కోరారు. ఏపీఎం దేవరాజు పాల్గొన్నారు.

రూ.307 కూలి వచ్చేలా చూడాలి


మాట్లాడుతున్న ఏపీఓ వెంకట్రావు

ముండ్లమూరు (కురిచేడు): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే ప్రతి కూలీకి రోజుకు రూ.307 వచ్చేలా చూడాలని ఏపీఓ టి.వెంకట్రావు సిబ్బందిని ఆదేశించారు. ముండ్లమూరులోని ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో బుధవారం క్షేత్ర సహాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యానవన పంటలు, ఫారం పాండ్లు, సుపరిపాలన అంశాల గురించి సమీక్షించారు. ఈసీ జి.శివరామకృష్ణ, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వైభవంగా సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ


విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

పెద్దదోర్నాల: దిగువ శ్రీశైలంగా వెలుగొందుతున్న మండల కేంద్రంలో ప్రసిద్ధి గాంచిన షిర్డీసాయి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు బుధవారంతో ముగిశాయి. బుధవారం జరిగిన సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను మండల ప్రజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. స్వస్తిశ్రీ చాంద్రమానేన విశ్వావసు నామ సంవత్సరం జేష్ఠ మాసం శుద్ధ త్రయోదశి సోమవారం నుంచి బుధవారం వరకు పలు కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు భక్తిశ్రద్ధలతో కార్యక్రమంలో పాల్గొని నూతనంగా ప్రతిష్ఠించిన పాలరాతి విగ్రహానికి విగ్రహ దాత బొగ్గరపు మణికంఠ శేఖర్‌తో పాటు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిష్ఠ కార్యక్రమం అనంతరం భారీ అన్నదానం చేశారు. సుదూర ప్రాంతాల్లో నివసిస్తున్న పట్టణానికి సంబంధించిన బంధుమిత్రులు, రక్త సంబంధీకులు కార్యక్రమానికి భారీగా హాజరు కావడంతో మండల కేంద్రంలో సందడి వాతావరణం నెలకొంది.


షిర్డీ సాయిని దర్శించుకుంటున్న భక్తులు

కమనీయంగా
తిరుమలనాథస్వామి కళ్యాణం


తలంబ్రాలు పోస్తున్న అర్చకులు

పెద్దారవీడు:

మండల పరిధిలోని చట్లమిట్ల పంచాయతీ రాంజపల్లి సమీపంలో వెలసిన శ్రీగొడ్రాలికొండ తిరులనాథస్వామి బ్రహోత్సవాల సందర్భంగా రాజ్యలక్ష్మి సమేత తిరుమలనాథస్వామి కళ్యాణం బుధవారం తెల్లవారు జామున వైభవంగా జరిగింది. అర్చకులు భవానీ ప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి వారికి ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, అర్చనలు, అలంకరణలు, నైవేద్యం, హారతులు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామి ఉత్సవ విగ్రాహాలను కళ్యాణ మండపానికి తీసుకొచ్చారు. పురోహితులు పెరుగుపల్లి సుబ్రహ్మణ్యశర్మ, పవన్‌కుమార్ శర్మలు కలిసి స్వామి కళ్యాణాన్ని వేద మంత్రోచ్చరణాల నడుమ శాస్త్రోక్తంగా మంగళ వాయిద్యాల నడుమ అంగరంగా వైభవంగా నిర్వహించారు. అనంతరం వధూవరులను పట్టు వస్త్రాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారి కళ్యాణాన్ని కనులారా తిలకించి భక్తి పారవశ్యంతో మురిసిపోయారు. ఆలయ ప్రాంగణం భక్తులు గోవింద, గోవింద..అంటూ గోవింద నామస్మరణతో మార్మోగింది. భక్తులకు ముత్యాల తలంబ్రాలు, తీర్థప్రసాదాలు పపిణీ చేశారు. సింహ వాహనంపై స్వామి కొలువుదీరి ఆలయం ప్రాంగణంలో విహరిస్తూ భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.

ప్రమాదకరంగా చెట్టు


రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

● పట్టించుకోని అధికారులు

దర్శి (కురిచేడు): దర్శి మండలం తూర్పు గంగవరం రోడ్డులో చెట్టు రోడ్డుకు అడ్డంగా పడిపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రాత్రి వేళ చెట్టు కనిపించక వాహనచోదకులు చెట్టుకొమ్మలు గుచ్చుకుని గాయాలపాలవుతున్నారు. సింగన్నపాలెం–బొట్లపాలెం మధ్య చెట్టుపడి ఎండిపోయినా తొలగించలేదు. నిత్యం ఈ దారిపై ద్విచక్ర వాహనాలు, ఆటోలు, బస్సులు, లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టును ఆర్‌అండ్‌బీ అధికారులు వెంటనే తొలగించి ప్రమాదాలు జరగకుండా ప్రజలను కాపాడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.